# దళిత మహిళపై థర్డ్ డిగ్రీ.. సిగ్గు సిగ్గు

## బాధ్యులైన పోలీసులపై అట్రాసిటీ కేసు పెట్టాలి: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): షాద్‌నగర్ దళిత మహిళ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. దొంగతనం ఒప్పుకోవాలంటూ మహిళ అని కూడా చూడకుండా అమానవీయంగా దాడికి తెగబడతారా? ఇంత కర్కశత్వమా? సిగ్గు.. సిగ్గు.. అని మండిపడ్డారు. కన్న కొడుకు ముందే నిక్కరు తొడిగి, బూట్లతో తంతూ చిత్రహింసలకు గురి చేయటమంటే ఇంతకన్నా సిగ్గుపడాల్సిన అంశం వేరే ఏముంది? అని ధ్వజమెత్తారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచి వేసిందని, రక్షించాల్సిన పోలీసుల నుంచి ఇలా రక్షణ లేని పరిస్థితి ఏమిటి? అని వాపోయారు. అసలు రాష్ట్రంలో ఏం జరుగుతున్నది? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఓ వైపు మహిళలపై అత్యాచారాలు, అవమానాలు మరోవైపు దాడులు, దాష్టీకాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యథా రాజా తథా ప్రజా అన్నట్టు.. ముఖ్యమంత్రే స్వయంగా ఆడబిడ్డలను అవమానిస్తుంటే.. పోలీసులు తామేమైనా తక్కువా? అన్నట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలంటే ఈ ప్రభుత్వానికి ఎందుకింత చిన్న చూపు? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల ఉసురు ఈ ప్రభుత్వానికి మంచిది కాదని, దాడికి పాల్పడిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు.

### విద్యార్థులకు నాసిరకం భోజనమా?

ప్రభుత్వ బడుల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించటంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. నిజామాబాద్ జిల్లా కొత్తపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కారం లేని పప్పు వడ్డించారని, పిల్లలు తినేందుకు ఇష్టపడకపోవటంతో వాళ్లకు గొడ్డు కారం, నూనె పోసి భోజనం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## షాద్‌నగర్ ఘటనపై సైబరాబాద్ సీపీ ఆగ్రహం

### డీఐ సహా ఐదుగురు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): షాద్‌నగర్‌లో దళిత మహిళను కొట్టిన ఘటనపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి సీరియస్ అయ్యారు. ఘటనపై షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామిని విచారణాధికారిగా నియమించి ఒక్కరోజులోనే విచారణ జరిపించారు. మహిళను విచక్షణారహితంగా కొట్టినట్టు నివేదిక సమర్పించడంతో వెంటనే స్పందించిన సీపీ మహంతి చర్యలు చేపట్టారు. డీఐ రామిరెడ్డి, కానిస్టేబుళ్లు జాకీర్, మోహన్‌లాల్, రాజు, అఖిల్, కరుణాకర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు.ఘటనపై బాధితులు ఫిర్యాదు చేస్తే పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదు చేస్తామన్నారు.

### సూర్యాపేటలో ముగ్గురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

సూర్యాపేట టౌన్, ఆగస్టు 5: ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సూర్యాపేటలోని ముగ్గురు కానిస్టేబుళ్లను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమాలకు పాల్పడిన సూర్యాపేట ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు ఎం రాంబాబు, ఎం బాలకృష్ణ, ఎల్ పూర్ణచందర్‌పై చర్యలు తీసుకున్నారు.

# రాష్ట్రంలో లాఠీ పోలీసింగ్

## సమాజం తలదించుకునేలా పోలీసుల వ్యవహారం.. దళిత మహిళ పై థర్డ్ డిగ్రీ ప్రయోగం దారుణం

- హత్యలు, లైంగికదాడులు తప్ప భద్రత లేదు: సబితా ఇంద్రారెడ్డి
- షాద్‌నగర్ దవాఖానలో దళిత మహిళ కు పరామర్శ
- పోలీసులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్
- బాధిత మహిళ కు లక్ష సాయం
- రొమ్ములపై తంతరా? ఆర్ఎస్పీ ప్రవీణ్ ఆగ్రహం




షాద్‌నగర్ సర్కారు దవాఖాన ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో సబిత, ఎమ్మెల్సీ వాణీదేవి తదితరులు

షాద్‌నగర్, ఆగస్టు 5: ఓ దళిత మహిళలపై పోలీసులు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉన్నదని, రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ లేకుండా పోయిందని, అంతా లాఠీ పోలీసింగే రాజ్యమేలుతున్నదని, శాంతిభద్రతలపై ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధలేదని, ఏ నేరం జరిగినా చర్యలు లేవని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. షాద్‌నగర్ పట్టణంలోని సర్కారు దవాఖానలో చికిత్స పొందుతున్న దళిత మహిళ సునీతను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్‌రెడ్డి, సురభి వాణిదేవి, మాజీ ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్, మాజీ ఎంపీ మంద జగన్నాథం, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ ఈటె గణేశ్‌తో కలిసి సోమవారం పరామర్శించారు. పోలీసులు ప్రవర్తించిన తీరుపై బాధిత మహిళను అడిగి తెలుసుకుని దిగ్భ్రాంతి చెందారు. అనంతరం సబిత దవాఖాన ఆవరణలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా హత్యలు, లైంగికదాడులు, దోపిడీలు తప్ప ప్రజలకు రక్షణ కరువైందని మండిపడ్డారు. గత ప్రభుత్వం పోలీసులు, ప్రజలను సమన్వయం చేసుకుంటూ సేవలందించిందని, ఇప్పుడవి కనుమరుగయ్యాయని తెలిపారు. మహిళ అని చూడకుండా ఇష్టంవచ్చినట్టు కొట్టడం బాధాకరమని, పోలీసుల థర్డ్ డిగ్రీని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. దళిత మహిళను కొట్టిన పోలీస్ అధికారులను, సిబ్బందిని వెంటనే విధులనుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు.

### సీఎం అండతో పోలీసుల ఇష్టారాజ్యం: ఆర్ఎస్పీ

దొంగతనం నెపంతో షాద్‌నగర్‌కు చెందిన దళిత మహిళ సునీతను పోలీసులు ఇష్టంవచ్చినట్టు కొట్టడం బాధాకరమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. మహిళా అని చూడకుండా ఆమె రొమ్ముళ్లపై పోలీసులు కాళ్లతో తన్నడం తీవ్రంగా కలిచివేసిందని, పోలీసులకు ఈ అధికారం ఎవ్వరిచ్చారని మండిపడ్డారు. నాలుగు రోజుల పాటు మహిళను ఇష్టానుసారం విచారణ పేరుతో కొడుతుంటే డీసీపీ, ఏసీపీ ఏం చేశారని ప్రశ్నించారు. మహిళలను రాత్రివేళ విచారించడం సరికాదనే విషయం పోలీసులకు తెలియదా? అని, విచారణ పేరుతో మహిళను, ఆమె భర్తను, కొడుకును దారుణంగా కొట్టడం నేరంకాదా? అని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముళ్ల కాన్వాయ్‌లకు రక్షణ కల్పిస్తున్న పోలీసులు, సామాన్యులకు మాత్రం రక్షణ కల్పించడం లేదని, రేవంత్‌రెడ్డి అండతోనే పోలీసులు రెచ్చిపోతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు అవమానాలకు గురవుతున్నా సీఎం స్పందించడం లేదని విమర్శించారు. అసెంబ్లీలో మహిళా ప్రజాప్రతినిధులను స్వయంగా ముఖ్యమంత్రే అవమానించేలా వ్యవహరిస్తే ఇక రాష్ట్రంలో మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదన్నారు. దళిత మహిళ సునీతకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో 40 వేల మంది పోలీసులను నియమించడంతో పాటు 11 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి శాంతిభద్రతలను బలోపేతం చేస్తే, నేటి సీఎం లా అండ్ ఆర్డర్‌ను నీరుగారుస్తున్నారని దుయ్యబట్టారు. అశ్వారావుపేట ఎస్ఐ పురుగుల మందు తాగి చనిపోయినా, భూపాలపల్లి ఎస్ఐ తోటి మహిళా కానిస్టేబుల్‌పై లైంగికదాడి చేసినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని విమర్శించారు. షాద్‌నగర్ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

### పోలీస్‌స్టేషన్లలో సెటిల్‌మెంట్లు: ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లకు ఉన్న ప్రాధాన్యత సామాన్యులకు లేదని, నందిగామ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లు విచ్చలవిడిగా సెటిల్మెంట్లు చేసుకుంటున్నారని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రాజకీయ ఒత్తిళ్లతో ప్రజలపై నాన్ బెయిలబుల్ సెక్షన్లు నమోదుచేస్తున్నారని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండాలని, పేదలకు న్యాయం జరిగేలా పోలీసుల పనితీరు ఉండాలని సూచించారు. దళిత మహిళపై పోలీసుల థర్డ్‌డిగ్రీ దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు.

### జడ్జిలే ఆశ్చర్యపోయేలా పోలీసుల తీరు: మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

పోలీసుల తీరుతో న్యాయమూర్తులు కూడా ఆశ్చర్యానికి గురవుతున్నారని మాజీ ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్ చెప్పారు. షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన పోలీసులు నమోదు చేసిన కేసులను చూసి జడ్జి ఆశ్చర్యపోయారని గుర్తుచేశారు. పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని వాపోయారు. సునీతకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, నాయకులు లక్ష్మణ్‌నాయక్, బీష్వ రామకృష్ణ, ప్రతాప్‌రెడ్డి, ఒగ్గు కిశోర్, అడ్డు, చెట్ల నర్సింహ, శివ, దినేశ్‌సాగర్ పాల్గొన్నారు.

# 50:50 ఆశతోనే అరాచకం!

మొదటిపేజీ తరువాయి...



సగం వాటా.. అంటే పదకొండు తులాల బంగారం దక్కుతుందనే అత్యాశ వారిని రెచ్చిపోయేలా చేసిందని స్పష్టమవుతున్నది. చివరికి విచక్షణ కోల్పోయి సభ్య సమాజం సిగ్గుపడేలా దళిత మహిళపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించే దాకా వెళ్లింది. ఇక్కడ పోలీసుల వ్యవహారం, సాంకేతికత వినియోగంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన 'తెలంగాణ పోలీస్'కు మచ్చ తెచ్చింది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఘటనలో ఫిర్యాదుదారుడితో పోలీసులు కుమ్మక్కయి, రికవరీ సొమ్ములో 'ఫిఫ్టీ ఫిఫ్టీ' ఒప్పందం చేసుకొని దళిత మహిళను చిత్రహింసలు పెట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఘటన జరిగిన సమయంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న కారణంగా పోలీసులు పక్కా ప్రణాళికతో విషయం బయటికి పొక్కకుండా జాగ్రత్త పడినట్టు తెలుస్తున్నది. ఓవైపు పోలీస్ ఉన్నతాధికారులు ఫ్రెండ్లీ పోలీసింగ్ కోసం వినూత్న కార్యక్రమాలు చేపడుతుంటే, మరోవైపు కిందిస్థాయి పోలీస్ అధికారులు, సిబ్బంది నోటికి, లాఠీకి మాత్రమే పని చెబుతుండటం చర్చనీయాంశమైంది.

### అంగీకరించాలని కర్కశత్వం

ఫిర్యాదుదారుడితో డీఐతో పాటు క్రైం సిబ్బంది కుదుర్చుకున్న ఒప్పందం వల్లే దొంగతనం చేసినట్టు ఒప్పుకోవాలని దళిత మహిళలను, ఆమె కొడుకును, భర్తను ఇష్టం వచ్చినట్టు కొట్టారన్న విషయం బయటకు వచ్చింది. పోలీసుల దెబ్బలకు తాళలేక మహిళ స్పృహ తప్పి పడిపోతే ఆమెను రాత్రికి రాత్రే ఇంటికి పంపిన పోలీసులు తదుపరి ఫాలో అప్‌లో కూడా ఉన్నారు. మరుసటి రోజు ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వారం పాటు మరో గ్రామంలో ఆమెను దాచిపెట్టారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఆ సమయంలో అసెంబ్లీ సమావేశాలు జరుతున్నందున విషయం బయటపడకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నట్టు తెలుస్తున్నది. అంతా సద్దుమణిగిందని పోలీసులు భావించిన సమయంలో బాధిత మహిళ నోరు విప్పడంతో వారి కర్కశత్వం లోకానికి తెలిసింది.

### శివారులో అంతే!

సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్లలో పోలీసు జులుం నడుస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్‌స్పెక్టర్, ఎస్సై, కానిస్టేబుళ్లకు ప్రజలు భయపడాలనే ధోరణితో వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఠాణాకు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడే పద్ధతులకు తిలోదకాలిచ్చినట్టు ఇటీవలి ఉదంతాల ద్వారా స్పష్టమవుతున్నది. ఇటీవల శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న సందర్భంగా యువకులను అక్కడి ఇన్‌స్పెక్టర్ బూటు కాళ్లతో తన్నుతూ కొట్టుకుంటూ తీసికెళ్లిన ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో నెటిజన్లు తీవ్రస్థాయిలో స్పందించారు. ఔటర్ రింగు రోడ్డుపై ఓ డ్రైవర్‌ను జీడిమెట్లకు చెందిన ట్రాఫిక్ ఎస్సై బూతులు తిడుతూ జులుం ప్రదర్శించిన వీడియో కూడా సోషల్‌మీడియాలో వైరలై ఆ శాఖపై ప్రజల ఆగ్రహానికి కారణమైంది.

### శాస్త్రీయ విచారణ మరిచిన పోలీసులు

దొంగతనం కేసులో షాద్‌నగర్ పోలీసులు శాస్త్రీయ విచారణను పక్కనబెట్టారు. ఫిర్యాదుదారుడు అనుమానం వ్యక్తం చేయగానే మహిళ అని కూడా చూడకుండా మూస పద్ధతుల్లో విచారణ పేరిట ఆమెను చిత్రహింసలు పెట్టారు. బీఆర్ఎస్ హయాంలో అనేక కీలకమైన కేసుల్లో తెలంగాణ పోలీసులు చేపట్టిన శాస్త్రీయ విచారణ, ఇతర రాష్ట్రాల పోలీసుల మన్ననలు పొందింది. కానీ షాద్‌నగర్ ఘటనలో అందుకు భిన్నమైన విచారణ శైలి కనిపించింది. అన్నిటికీ మించి కొడుకు ముందే ఓ తల్లిని బట్టలు విప్పించి కొట్టడం వంటి జుగుప్సాకరమైన ఘటన చోటుచేసుకోవడం మొత్తం పోలీసులనే తలదించుకునేలా చేసింది.

# ఈ నగరానికి ఏమైంది?



న్యాయం చేయాలని చంపాపేట రహదారిపై రాస్తారోకో చేస్తున్న కుటుంబసభ్యులు

## పోలీసులను చూసి పారిపోతూ మృతి

- క్వార్టర్స్‌పై నుంచి జారిపడి యువకుడి దుర్మరణం
- పోలీసులు వెంబడించడం వల్లే చనిపోయాడని ఆందోళన


సైదాబాద్, ఆగస్టు 5 : గంజాయికి అలవాటుపడ్డ యువకుడు ఎక్సైజ్ పోలీసులను చూసి భయంతో పారిపోతుండగా ప్రమాదవశాత్తు మృతిచెందాడు. పోలీసులు వెంబడించడం వల్లే చనిపోయాడని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు చంపాపేటలో సోమవారం రాస్తారోకో చేశారు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణికాలనీలో జరిగిన ఘటనపై ఎక్సైజ్ పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మత్తు పదార్థాల ద్వారా కలిగే నష్టాలపై అవగాహన కలిగించేందుకు సింగరేణికాలనీలోని వాంబే గృహాల్లో మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అప్పటికే గంజాయి మత్తులో ఉన్న ఇదే కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ ఖలీం పాషా(28), పోలీసులను చూసి తనను పట్టుకునేందుకే వచ్చారని భావించి వాంబే క్వార్టర్‌పైకి ఎక్కాడు. మూడంతస్థుల భవనంపై నుంచి డ్రైనేజీ పైప్‌లైన్ సాయంతో దిగే ప్రయత్నంలో జారి పడి గాయపడ్డాడు. కుటుంబసభ్యులు చంపాపేటలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ నాయక్ సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఘటన విషయాన్ని తెలిపారు. ఖలీం పాషా పరిస్థితి విషమించటంతో ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం చనిపోయాడు.

### కుటుంబసభ్యుల రాస్తారోకో

పోలీసులు వెంబడించడం వల్లే పాషా పారిపోయే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు చనిపోయాడని కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చంపాపేటలో రాస్తారోకో చేశారు. న్యాయం జరిగేలా చూస్తామని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. పాషాపై ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసులు లేవని ఎక్సైజ్, ప్రొహిబిషన్ హైదరాబాద్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు తెలిపారు. సిబ్బంది వెంబడించలేదని, పోలీసులను చూసి భయంతో పారిపోతుండగానే ప్రమాదవశాత్తు చనిపోయాడని చెప్పారు.

## హైదరాబాద్‌లో బాలుడి కిడ్నాప్?

- 24 గంటలైనా దొరకని ఆచూకీ
- 4 బృందాలతో గాలింపు: సీఐ



బడంగ్‌పేట, ఆగస్టు5: ఎనిమిదో తరగతి విద్యార్థి అదృశ్యమైన ఘటన మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో ఆదివారం కలకలం రేపింది. దాసరి నారాయణ రావు కాలనీకి చెందిన మధుసూదన్‌రెడ్డి, కవిత దంపతుల రెండో కుమారుడు మహేందర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఎంత వెతికినా ఆచూకీ దొరకక రాత్రి 8 గంటలకు మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు బృందాలను రంగంలోకి దింపి గాలిస్తున్నట్టు సీఐ నాగరాజు తెలిపారు. సీసీ పుటేజీలను పరిశీలించగా ఓ బైక్‌పై ఎక్కి వెళ్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఆ వాహనం నంబర్ ప్లేట్ ట్రేస్ ఔట్ కాకపోవడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో బాలుడి కోసం గాలిస్తున్నారు. విద్యార్థి ఇంట్లో వెళ్లేటప్పుడు రూ.2,000 నగదు తీసుకెళ్లినట్టు తల్లిదండ్రులు చెప్తున్నారని, ట్యూషన్‌కు బాలుడు వెళ్లగా, రాలేదని టీచర్లు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అనేక కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేసిన్నట్టు సీఐ నాగరాజు తెలిపారు. విద్యార్థి అదృశ్యమయ్యాడా? కిడ్నాప్ అయ్యాడా అన్నది తేలాల్సి ఉన్నది.

## బాలికను నిర్బంధించి లైంగికదాడి

- పరారీలో నిందితుడు.. పోక్సో చట్టం కింద కేసు

బేగంపేట్ ఆగస్టు 5: ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను బెదిరింపులతో నిర్బంధించి లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై హైదరాబాద్ బేగంపేట పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బేగంపేటలో నివసించే ఓ వ్యక్తి ఆదివారం సాయంత్రం విధుల కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇంట్లో అతని కూతురు (15) ఒంటరిగా ఉన్నది. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన ఆ వ్యక్తి తలుపు మూసి ఉండటంతో తలుపుతట్టాడు. ఎవరూ తీయకపోవడంతో బలవంతంగా నెట్టాడు. ఇంట్లో నుంచి సోనూ(20) అనే యువకుడు అతన్ని నెట్టుకుంటూ బయటకు పరుగుతీశాడు. ఏం జరిగిందని ఇంట్లో ఉన్న తన కూతురును ఆరా తీశాడు. తన నోట్లో గుడ్డలు కుక్కి నిర్బంధించి లైంగికదాడికి పాల్పడ్డట్టు ఆమె తెలిపింది. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడని చెప్పింది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్న బేగంపేట పోలీసులు పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## కన్నవారిపై ఖాకీ జులుం!

- తోబుట్టువుల ఆస్తిపై సీఐ కన్ను
- వృద్ధ తల్లిదండ్రులకు చిత్రహింసలు
- కొడుకు నుంచి రక్షణ కల్పించండి
- డీజీపీకి ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ తల్లిదండ్రుల మొర



హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : అతనో పోలీసు ఉన్నతాధికారి. స్టేషన్‌లో కేసులు డీల్ చేయడం తెలిసిన ఆయన.. కన్న తల్లిదండ్రుల వేదనను అర్థం చేసుకోలేకపోయాడు. పైగా.. కని, పెంచి, ఓ ప్రయోజకుడిని చేసిన తల్లిదండ్రులనే అధికార మదంతో చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. అన్నయ్య తప్పుడు వ్యవహారం తెలిసిన తమ్ముడు.. మంచి పద్ధతి కాదని వారించి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించినా.. కఠిన ఖాకీ హృదయం చలించలేదు. విసిగివేసారిన ఆ తల్లిండ్రులు ఏకంగా పోలీస్ బాస్‌ను కలిసి తమ మొర ఏకరువు పెట్టారు. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురం మండలం, వెంకటాయింపల్లికి చెందిన రఘునాథ్‌రెడ్డి, బొజ్జమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. పెద్ద కొడుకు నాగేశ్వర్‌రెడ్డి రాచకొండ కమిషనరేట్‌లో ఓ స్టేషన్ సీఐ, చిన్నకొడుకు యాదయ్య కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. రఘునాథ్‌రెడ్డికి ఉన్న 30 ఎకరాల 23 గుంటల భూమిలో.. పెద్దకొడుకు పేరున 15 ఎకరాలు, చిన్న కొడుకు పేరున 11 ఎకరాలు పట్టాచేశాడు. మిగిలిన భూమిని కూతుళ్లకు ఇచ్చేందుకు తమ పేరున ఉంచుకున్నారు. ఈ భూమిపై పెద్దకొడుకు, సీఐ నాగేశ్వర్‌రెడ్డి కన్ను పడింది. తోబుట్టువులకు తానే దగ్గరుండి పంచాల్సింది పోయి, ఆ భూమిని కొట్టేసేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాడు. తన పేరున ఇంకో 5 ఎకరాలు పట్టా చేయాలని వృద్ధులైన తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాడు. ఇష్టమొచ్చినట్లు దూషిస్తూ పలుమార్లు దాడి చేశాడు. పెద్ద కొడుకు వేధింపులు తాళలేక చిన్న కొడుకు యాదయ్య ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయాలన్నీ డీజీపీ జితేందర్‌కు ఆ వృద్ధ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతూ మొరపెట్టుకున్నారు. తన కొడుకు నాగేశ్వర్‌రెడ్డిపై చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు. ఈ విషయంపై విచారణ చేయిస్తామని, ఇబ్బంది లేకుండా చూస్తామని డీజీపీ వారికి హామీ ఇచ్చినట్టు తెలిసింది.

## తప్పించుకున్నాడా?.. తప్పించారా?

- మధురానగర్ ఠాణా నుంచి రెండోసారి పారిపోయిన దొంగ
- పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- కష్టపడి అప్పగిస్తే వదిలేశారని స్థానికుల మండిపాటు



దొంగను పట్టుకున్న నగర కమిటీ సభ్యుడు యాదగిరి

వెంగళరావునగర్, ఆగస్టు 5 : మధురానగర్ ఠాణా నుంచి ఓ దొంగ రెండోసారి పారిపోయాడు. అతడు తప్పించుకున్నాడా ? లేక పోలీసులే తప్పించారా ? అని స్థానికులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. చోరీలతో విసుగుచెంది అతికష్టం మీద దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగిస్తే వారి తీరుతో అతడు మళ్లీ బయటపడ్డాడని విమర్శిస్తున్నారు. షాద్‌నగర్‌లో చేయని నేరానికి ఓ మహిళను దొంగను చేసి పోలీసులు ఇష్టంవచ్చినట్టు కొట్టారని, ఇక్కడ మాత్రం దొంగతనం చేసినట్టు రుజువులున్నా దొంగను వదిలేశారని మండిపడుతున్నారు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ సమీపంలోని యాదగిరినగర్ బస్తీలోని ఇండ్లల్లో వాటర్ ట్యాప్‌ల చోరీలతో జనం బేజారయ్యారు. పోలీసులకు చెప్పినా వినే పరిస్థితి లేకపోడంతో తామే రంగంలోకి దిగారు. దొంగను ఎలాగైనా పట్టుకోవాలని నిర్ణయించుకున్నారు. ఓచోట దొంగ చోరీ చేస్తుండగా సీసీ కెమెరాల్లో నమోదు కావడంతో బస్తీవాసులు ఆ పుటేజీని తమ వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్‌చేసి అందర్నీ అలర్ట్ చేశారు. ఆగస్టు 1న గట్టి నిఘాపెట్టి దొంగను యాదగిరినగర్ కమిటీ సభ్యులు పట్టుకున్నారు. అతడు నేపాల్‌కు చెందిన వికాస్‌గా గుర్తించారు. దేహశుద్ధి చేసి మధురానగర్ పోలీసులకు అప్పగిస్తే అదేరోజు పరారయ్యాడు. పోలీసులు గాలించి మళ్లీ జూబ్లీహిల్స్ ప్రాంతంలో శుక్రవారం రెండోసారి అదుపులోకి తీసుకుని ఠాణాలో ఉంచారు. కాగా స్టేషన్ నుంచి ఆదివారం సాయంత్రం సదరు దొంగ మళ్లీ పారిపోవడంతో విధి నిర్వహణలో పోలీసుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## మహిళల భద్రతలో సర్కారు విఫలం

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, క్రైం రేటు దారుణంగా పెరిగిపోయిందని, మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. శాంతిభద్రతల పరిస్థితి ఇలా తయారైతే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినే పరిస్థితి రావొద్దని, ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో మహిళలకు తెలంగాణ సురక్షిత ప్రాంతంగా ఉండేదని, శాంతిభద్రతల విషయంలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని గుర్తుచేశారు. షాద్‌నగర్‌లో దళిత మహిళను పోలీసులు హింసించిన తీరు చాలా దారుణమని, దళిత మహిళను బట్టలు విప్పి కొట్టే దుస్థితికి తెలంగాణ చేరుకున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదని, మగ పోలీసులతో ఓ మహిళను విచారించడమా? అంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో నేరాల రేటు 9 శాతం పెరిగిపోయిందని, ముఖ్యమంత్రే హోంమంత్రిగా ఉన్నారని, దీనిపై ఏం సమాధానం చెబుతారని, శాంతిభద్రతలపై సీఎం సమీక్ష చేయడం లేదా? అని నిలదీశారు. రాష్ట్రంలో లైంగికదాడులు, దొంగతనాలు, హత్యలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. షాద్‌నగర్ ఘటనలో సీఐని సస్పెండ్ చేసినంత మాత్రాన దళిత మహిళకు న్యాయం జరగదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ఇకనైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ పాలనలో అరాచకాలు

### ప్రభుత్వంపై మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఫైర్



మహబూబాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): షాద్‌నగర్‌లో దళిత మహిళను కొడుకు ముందే వివస్త్రను చేసి కర్కశంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించి మానవ మృగాల్లా ప్రవర్తించిన పోలీసులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ డిమాండ్ చేశారు. సోమవారం మహబూబాబాద్ జడ్పీ కార్యాలయ ఆవరణలో మీడియాతో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత 8 నెలల్లో మహిళలపై అత్యాచారాలు, భౌతికదాడులు, దోపిడీలు, హత్యలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఇప్పటి వరకు 180 మంది మహిళలపై లైంగికదాడులు, 500 మంది మహిళలపై దాడులు, హత్యలు, దోపిడీలు జరిగాయన్నారు. 8 నెలల కాలంలోనే ఇంత జరిగిందంటే రేవంత్‌రెడ్డి సిగ్గుతో తలదించుకోవాలని ధ్వజమెత్తారు.

## న్యాయవాదులపై పోలీసుల జులుం

- నేడు కోర్టు విధుల బహిష్కరణకు జనగామ బార్ అసోసియేషన్ పిలుపు
- మా పైనే దురుసుగా ప్రవర్తించారన్న సీఐ

జనగామ, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): కేసు విషయంలో మాట్లాడేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఇద్దరు న్యాయవాదులపై జనగామ స్టేషన్‌లో పోలీసులు దురుసుగా ప్రవర్తించి దాడి చేశారని జనగామ బార్ అసోసియేషన్ ఆరోపించింది. ఈ మేరకు మంగళవారం కోర్టు విధుల బహిష్కరణకు పిలుపునిచ్చింది. ఓ కేసు విషయంలో సోమవారం సాయంత్రం జనగామ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాదులు గద్దల అమృతరావు, కవితపై పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తూ దాడి చేశారని డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు రాత్రి 9 గంటలకు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అయితే, న్యాయవాదులే పోలీసులపట్ల దురుసుగా ప్రవర్తించారని సీఐ రఘుపతిరెడ్డి చెప్పారు.